క్లుప్తంగా

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన

దుండిగల్: దుండిగల్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. మెప్మా సీఓ మంజుల, రిసోర్స్ పర్సన్ శాంత, బూత్‌లెవల్ అధికారులు విద్యార్థులతో సమావేశమయ్యారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే నమోదు చేసుకున్న వాటిలో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.

విద్యార్థి చదువుకు ఏఈ అనూష ఆర్థికసాయం

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు సహాయం చేయడం తన అదృష్టమని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ఎర్ర అనూష అన్నారు. సిద్దిపేటలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి బత్తుల లోకేష్‌కు చదువునిమిత్తం డబ్బు అవసరం ఉందని హార్ట్ టూ హెల్ప్ ద్వారా తెలుసుకున్న ఆమె రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఆర్థిక సహాయం లోకేష్ ఎంబీబీఎస్ పూర్తి చేసే వరకు అందిస్తానని అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

దుండిగల్: నడిరోడ్డుపై తప్పిపోయిన బాలుడిని దుండిగల్ పోలీసులు చేరదీశారు. వివరాల్లోకి వెళ్తే.. గాగిల్లాపూర్ చౌరస్తా వద్ద బుధవారం సాయంత్రం మూడేళ్ల బాలుడు ఓ కిరాణా దుకాణం వద్ద ఏడుస్తూ కనిపించాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు బాలుడిని సముదాయించి బిస్కెట్లు తినిపించారు. పరిసర ప్రాంతాల్లో బాలుడి తల్లిదండ్రుల గురించి వాకబు చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు దుండిగల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జగద్గిరిగుట్ట: రాజీవ్ గృహకల్ప చర్చ్ సమీపంలోని సర్వేలల నం.348/1లో అక్రమంగా నిర్మించిన 5 బేస్మెంట్‌లను రెవెన్యూ సిబ్బంది కూల్చేశారు. కొంత కాలంగా కొంత మంది ఈ స్థలాన్ని కొన్నామని చెప్పి గది నిర్మాణలకు ప్రయత్నిస్తూ వస్తున్నారు. కాగా ఈనెల 18న రాజీవ్ గృహకల్పవాసులు ఈ స్థలాన్ని కాపాడాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో అంగన్వాడీ నడుపుకోవడానికి అనుమతి ఇస్తే నిర్మాణం చేసుకుంటామని గృహకల్ప వాసులు అదే రోజు వినతి పత్రం ఇచ్చారు. అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాకపోవంతో ఈ స్థలంలో అంగన్వాడీకి గదులు నిర్మాణం ప్రారంభించారు. కాగా ఈ నిర్మాణాలపై పలు ఫిర్యాదులు రావడంతో ఆర్ఐ రేణుక ఆదేశాల మేరకు బుధవారం రెవెన్యూ సిబ్బంది 5 బేస్మెంట్‌లను కూల్చేశారు.

సమ్మె విరమించి విధుల్లో చేరండి

ఏఎన్ఎమ్‌లకు డీఎంహెచ్ఓ వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఏఎన్ఎమ్‌లు సత్వరమే సమ్మెను ఉపసంహరించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ కోరారు. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం మెమోలు జారీ చేయడం, షోకాజ్ నోటీసు ఇవ్వడం, ఉద్యోగం నుంచి తొలగించడం వంటి క్రమశిక్షణ చర్యలను తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సమ్మె చేస్తున్న ఏఎన్ఎంలతో ఆయన చర్చించారు. ప్రభుత్వం ఏఎన్ఎంలకు మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తోందని తెలిపారు. వేతనాలు కూడా మిగతా రాష్ట్రాలను పోల్చుకుంటే బాగానే ఉన్నాయన్నారు. సమ్మె విరమించుకుని విధుల్లో పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఏఎన్ఎమ్‌ల సానుకూలమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో పలువురు వైద్యాధికారులు, ఏఎన్ఎమ్ ప్రతినిధులు ఉన్నారు.



కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్‌లో

అసమ్మతి గళం!

- ఇటీవల పార్టీకి గుడ్‌బై చెప్పిన చింతల యాదగిరి, నాగరాజు
- బీఆర్ఎస్‌లో కొనసాగుతూనే టికెట్ కోసం కాంగ్రెస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రభాకర్‌రెడ్డి
- గుర్తింపు లేదనే బాధతో పార్టీ మారే యోచనలో పలువురు బీఆర్ఎస్ నేతలు

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో రోజురోజుకు అసమ్మతి గళం పెరుగుతోంది. ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి, ఆయన తనయుడు కార్మిక నేత చింతల నాగరాజు పార్టీకి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి వ్యవహార శైలి ఆ పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్‌లో కొనసాగుతూనే ఏకంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకు కేటాయించాలని దరఖాస్తు చేయడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అవాకయ్యారు. అయితే ఇప్పటికే కాంగ్రెస్ తరఫున తమకే అవకాశం కల్పించాలని 12మందికి పైగా అభ్యర్థులు కోరుతున్నారు. దీంతో వారి అనుచర గణం, కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు.

గుర్తింపు లేదనే అసంతృప్తితోనే..

గతంలో ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండలం నుంచి టీడీపీ తరపున పోటీ చేసిన ప్రభాకర్‌రెడ్డి జెడ్పీటీసీగా గెలుపొందారు. అనంతరం అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరి ఏకంగా జడ్పీ వైస్‌చైర్మన్ అయ్యారు. ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగిన ఆయన తదనానంతరం మరో ఐదేళ్లు ఎలాంటి పదవులు లేకుండా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు.

- జెడ్పీ వైస్ చైర్మన్ పదవి కాలం పూర్తివడం.. గ్రామాలను మున్సిపాలిటీగా మార్చడంతో మరో మారు జెడ్పీటీసీగా అవకాశం లేకుండా పోయింది. మున్సిపాలిటీల ఏర్పాటు అనంతరం దుండిగల్ మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించారు. అది కూడా దక్కలేదు. ఆ తరువాత మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, మేడ్చల్ జిల్లా రైతు సమితీ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారని అయనను బుజ్జగించారు. ఆ పదవులు సైతం ఇతరులకు ఇవ్వడంతో అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో అంటీ ముట్టన్నట్లే వ్యవహరిస్తున్నారు.



బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి

- ఎమ్మెల్సీగా మొదటిసారి ఎన్నికైన శంభీపూర్ రాజు వెంట నడిచిన ఆయన తరువాత ఎమ్మెల్యే వివేకానంద్ శిబిరంలో చేరారు. అయినప్పటికీ పార్టీలో గుర్తింపు, పదవులు దక్కకపోవడంతో పార్టీ మారే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకునే బీఆర్ఎస్‌లో ఉంటూనే కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇదే విషయంపై ప్రభాకర్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా ఐదేళ్లుగా పార్టీలో ఎలాంటి పదవి అప్పగించలేదని, పార్టీలో సరైన గుర్తింపు, ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజుల్లో భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు.

18ఏళ్ల యువత ఓటరుగా నమోదు చేసుకోండి



రాజకీయ పక్షాలు, బీఎల్‌ఓలతో సమావేశమైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు

కుత్బుల్లాపూర్: బూత్ లెవెల్ సిబ్బందితో సహా అన్ని రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌లో తమకు సంబంధించిన వారి ఓటు ఉందో.! లేదో అన్న విషయాన్ని పరిశీలించుకోవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పక్షాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల వివరాలను రాజకీయ పక్షాలకు వివరించామని తెలిపారు. బూతు లెవల్ అధికారులు, స్పెషల్ అధికారుల ఫోన్ నంబర్లు కూడా వారికి అందజేశామన్నారు. సెప్టెంబర్ 19 వరకు నిర్వహించే క్యాంపెయిన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.
- వచ్చే నెల 2, 3వ తేదీల్లో ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సిబ్బంది ఉంటారని తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తేవాలని కోరారు. సమావేశంలో మోటే శ్రీనివాస్ యాదవ్ (బీజేపీ), జేమ్స్ (కాంగ్రెస్), సీవీ రత్నం (బీఎస్పీ), జయరామ్ (బీఆర్ఎస్), వామపక్షాల నేతలతో పాటు ఏఈఆర్‌ఓలు, ఉప కమిషనర్లు మల్లయ్య, నాగమణి పాల్గొన్నారు.

గ్రంథాలయం, వార్డు కార్యాలయం ప్రారంభం



బహదూర్‌పల్లిలో ప్రారంభిస్తున్న దుండిగల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి

సుభాష్‌నగర్: గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు మంచి వేదికలని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అన్నారు. బుధవారం బహదూర్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, వార్డు కార్యాలయాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మైసిగారి సుజాత, శివనూరి నవనీత, ఎల్లుగారి సత్యనారాయణ, భరత్‌కుమార్, గోపాల్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, సాయియాదవ్, కిరణ్, మాజీ సర్పంచ్ కొమురయ్యయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్లు మదన్‌రావు, సత్యనారాయణ, జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రగతినగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నార. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో రూ.50 లక్షలతో చేపడుతున్న వైకుంఠధామం అభివృద్ధి పనులకు బుధవారం ఆయన మేయర్ నీలారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకుంఠధామాన్ని ఓ మోడల్ గ్రేవ్‌యార్డులో తీర్చిదిద్దుతామన్నారు. పచ్చదనంతో పాటు నీటి సౌకర్యం, కూర్చునేందుకు వసతి గదులు, స్నానపు గదుల వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్: రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నాయకులు మహ్మద్ రఫీ, విజయరాంరెడ్డి ఉన్నారు.

బడుల్లో వసతులు కల్పించడంతో ప్రభుత్వం విఫలం

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్‌లు ఆరోపించారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ... పాఠశాల ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. సరైన మరుగుదొడ్లు, తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

- మన ఫౌండేషన్ ద్వారా అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంటోందన్నారు. దీంతో చాలా మంది ఇళ్లకు వెళ్లి తింటున్నారని ఆరోపించారు. విద్యార్థులు చాలీచాలని తరగతి గదుల్లో కూర్చోవాల్సి వస్తోందని.. గదుల్లో ఫ్యాన్‌లు, లైట్ల సౌకర్యం లేదని తెలిపారు.
- షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలయ్యారన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం వీడాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే డీఈవో కార్యాలయాన్ని నిర్బంధిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, పసుల సాయికుమార్, వెంకట్, రాములు, భాస్కర్, నాని, లక్ష్మణ్, ఆంజనేయులు, చందు, నితీష్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తనిఖీలు

సుభాష్‌నగర్: మల్కాజ్‌గిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాష్ బుధవారం గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఇటీవల కూల్చివేసిన నిర్మాణాలపై ఆరా తీశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరింపజేయాలని తెలిపారు.

ఆలయ పునర్‌నిర్మాణానికి భూమిపూజ



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: ఆలయాల దర్శనంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీలో పునర్ నిర్మాణం చేస్తున్న శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఆలయాభివృద్ధికి తన వంతు సహాయం ఎప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు, సీనియర్ నాయకుడు వారాల రాజు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వారాల మహేష్, కాలనీ అధ్యక్షుడు నారాయణరావు, డివిజన్ ఉపాధ్యక్షుడు విగ్నేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బిక్షపతి, ఉపాధ్యక్షుడు రవి గుప్తా, మహేష్ పటేల్ తదితరులు ఉన్నారు.

ఎంఎల్ఆర్ఐటీలో ఓరియంటేషన్ డే



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాంతికుమార్

దుండిగల్: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న విప్లవాత్మక మార్పుల కారణంగా దేశం అభివృద్ధి సాధిస్తోందని ఈపాం సిస్టమ్స్ డైరెక్టర్ సి.శాంతికుమార్ అన్నారు. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో బుధవారం ఓరియంటేషన్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాంతికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించే విధంగా కష్టపడాలన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీ తీవ్రంగా ఉందన్నారు. బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించడంతో పాటు పలువురికి ఉపాధి కల్పించే దిశగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐవీఆర్‌సీఎల్ లిమిటెడ్ గ్రూప్ హెడ్ కె.పాండురంగారావు, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి మమతారెడ్డి, డైరెక్టర్ అనుశ్రేయా రెడ్డి, ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరా రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



మృతుడు నాగేంద్ర

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. భాగ్యలక్ష్మినగర్ కాలనీలో నివాసముండే నాగేంద్ర(27) ప్రైవేట్ ఉద్యోగి. కాగా నాలుగు రోజుల క్రితం అతని భార్య ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. కొన్ని రోజులుగా నాగేంద్ర పని ఒత్తిడితో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడని కుటుంబ సభ్యులు చెప్పారు. బుధవారం ఉదయం 11గంటల సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వృథాగా నీరు.. పోతున్నా పట్టించుకోరు!



సోమయ్యనగర్‌లో..



చింతల్ కల్పనా సొసైటీలో..



మైసమ్మనగర్‌లో..

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్, సోమయ్యనగర్, షిరిడీహిల్స్ ఇంకా పలు ప్రాంతాలలో లీకేజీలతో తాగునీరు వృథాగా పోతోంది. జలమండలికి ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంది. ఉదయం నీళ్లు వదిలే సమయంలో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు వరదలా పారుతూ.. రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేసి తాగునీరు వృథాగా పోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – జగద్గిరిగుట్ట

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

జీడిమెట్ల: కడుపునొప్పి తాళలేక ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట్ జిల్లా మద్దూర్ మండలం సభ్యనాయక్‌తాండాకు చెందిన కిషన్ నాయక్, అనిత(21) భార్యాభర్తలు. కాగా వీరిద్దరికి 8నెలల క్రితం వివాహం జరిగింది. వారు ఇద్దరు బతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చి చింతల్‌లో ఉంటున్నారు. అనిత కొన్ని నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం సైతం అనితకు తీవ్ర కడుపునొప్పి రావడంతో తండ్రికి ఫోన్‌ద్వారా సమాచారం అందించింది. అనిత భర్త కిషన్‌నాయక్ ఊళ్లో ఉండటంతో రాత్రి 8గంటలకు అనిత బావ ఇంటికి వచ్చి చూడగా అనిత షవర్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించింది. వెంటనే అనితను మల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి గోపాల్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా రాఖీ పౌర్ణమి వేడుకలు

రాఖీ పౌర్ణమి వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఒక రోజు ముందుగానే సందడిగా జరిగాయి. బుధవారం వివిధ పాఠశాలల్లో విద్యార్థులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ప్రజాప్రతినిధులకు మహిళలు, పార్టీ కార్యకర్తలు రాఖీలు కట్టారు. రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రధాన మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అదే విధంగా స్వీట్ల దుకాణాల్లో కొనుగోలుదారుల రద్దీ నెలకొంది. – కుత్బుల్లాపూర్



చింతల్ బచ్‌పన్ స్కూల్‌లో రాఖీ వేడుకల్లో చిన్నారులు



శంభీపూర్ గ్రామంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు రాఖీ కడుతున్న మహిళలు



నార్త్ సిటీ స్కూల్‌లో..



సహజమైన రంగులతో రాఖీలు తయారు చేస్తున్న విద్యార్థులు

నేటి నుంచి నేషనల్ మెగా లోక్ అదాలత్

హఫీజ్‌పేట్: కూకట్‌పల్లి కోర్టులో ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కేసుల్లో పట్టుబడిన వారు సంబంధిత పత్రాలతో (డ్రైవింగ్ లైసెన్స్, వాహనం ఆర్సీ, ఆధార్‌కార్డు 3 చొప్పున జిరాక్స్ కాపీలు) ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 94906 17330, 87125 13147, 87125 13148, 95504 83016, 87125 13149లలో సంప్రదించాలని పేర్కొన్నారు.